నమస్తే తెలంగాణ
# రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 11 జనవరి 2025 | RANGAREDDY

## సీఎం రేవంత్‌ను చూసి ఊసరవెల్లి సిగ్గుపడుతుంది : మెతుకు ఆనంద్



వికారాబాద్, జనవరి 10 : అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్‌రెడ్డి, తాను సీఎంగా ఉన్నంత కాలం సినిమాలకు అదనపు ప్రివిలేజెస్ ఉండవని, టికెట్ రేట్లు పెరుగవని ప్రకటించి, నెల రోజులు కాక ముందే మాట మార్చేశాడని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఆరోపించారు. ఏ విషయంలోనూ మాట నిలబెట్టుకోలేని సీఎం.. కనీసం అసెంబ్లీ సాక్షిగా చేసిన ప్రకటననూ నిలబెట్టుకోలేదన్నారు. రెండు రెండే.. దొందూ దొందే.. అన్నట్టుగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి కూడా బెనిఫిట్ షోలు, అడిషనల్ షోలు ఉండవు, టికెట్ రేట్లు పెంచమూ.. అని అసెంబ్లీలోనే ప్రకటించి.. మాటలను గాలికొదిలేశారన్నారు. తాజాగా తెలంగాణలో గేమ్ చేంజర్ సినిమాకు టికెట్ రేట్లు పెంచుతూ అడిషనల్ షోలకు పర్మిషన్ ఇస్తూ జీవో జారీ చేయడంపై మాట నిలబెట్టుకోలేని తనానికి నిదర్శనమని అన్నారు.

## కేటీఆర్‌ను కలిసిన యువనేతలు



షాబాద్ : బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను యువనేతలు పట్నం అవినాశ్‌రెడ్డి, పట్లోళ్ల కార్తీక్ రెడ్డిలు శుక్రవారం నగరంలోని నందినగర్‌లో ఉన్న నివాసంలో కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. చేవెళ్ల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి నిరంతరం పాటు పడుతున్న కార్తీక్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డిలకు రాబోయే రోజుల్లో మంచి భవిష్యత్తు ఉంటుందని కేటీఆర్ తెలిపారు.



ఇబ్రహీంపట్నంరూరల్ : ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం గేటుకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ వర్కర్లు

**ప్రజాప్రతినిధుల కార్యాలయాలు, ఇండ్లు, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట నిరసనల హోరు..**

**కాంగ్రెస్ సర్కార్ మోసాన్ని ఎండగట్టి.. పెద్ద ఎత్తున నినాదాలు**

**ఎన్నికప్పుడు వేతనాన్ని పెంచుతామని హామీ ఇచ్చి విస్మరించిందని ఆరోపణ**

**రానున్న అసెంబ్లీ సమావేశాల్లో రూ.18వేలుగా వేతనాన్ని నిర్ణయించాలని డిమాండ్**

**తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమిస్తామని వెల్లడి**



కొడంగల్‌లో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

# ఆశ వర్కర్ల.. ఆగ్రహ జ్వాల

## ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ధర్నాలు

*కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉమ్మడి రంగారెడ్డి జిల్లావ్యాప్తంగా సీఐటీయూ, సీపీఐల ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధుల కార్యాలయాలు, ఇండ్లు, తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ఆశ వర్కర్లు ధర్నాలు నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాన్ని ఎండగడుతూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్కలు వేతనాన్ని పెంచుతామని హామీ ఇచ్చి.. ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారని మండిపడ్డారు. ఫిబ్రవరి నెలలో జరుగనున్న అసెంబ్లీ సమావేశాల్లో తమ న్యాయమైన డిమాండ్లను నెరవేర్చేలా తీర్మానాలు చేయాలని, కనీస వేతనం రూ. 18వేలుగా నిర్ణయించాలని కోరారు. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం కార్యాలయం గేటుకు వినతి పత్రం సమర్పించారు. కొడంగల్‌లోని కడా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆశ వర్కర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం లేచింది మొదలు సాయంత్రం వరకు విధుల్లో ఉంటున్నామని, ఆదివారం సెలవు ప్రకటించాలని డిమాండ్ చేశారు. పరిగిలోని ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇంటి ఎదుట ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. తమ డిమాండ్లు నెరవేరేవరకు ఉద్యమిస్తామన్నారు. వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా పట్టించుకోవడం లేదని ఆ సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.*

*- న్యూస్ నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ*



వికారాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు



పరిగిలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఇంటి ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు



తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, ఆశ వర్కర్లు



దివ్యాంగులకు ట్రై సైకిల్స్ అందజేస్తున్న మాజీ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి

# సాకులు చెప్పొద్దు..

**పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయండి..**

**అధికారులకు ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి ఆదేశం**

బడంగ్‌పేట, జనవరి 10 : మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయించాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లెలగూడలో ఉన్న ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ ఆర్ జ్ఞానేశ్వర్, డీఈ వెంకన్న, ఏఈ శ్రీనివాస్ తదితరులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మీర్‌పేట పెద్ద చెరువు సమీపంలో నిర్మాణం చేస్తున్న క్రీడా మైదానం పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, టెన్నిస్ తదితర కోర్టులను ఏర్పాటు చేయించాలన్నారు. చిన్న పిల్లలకు సంబంధించిన ఆట వస్తువులను ఏర్పాటు చేయించాలన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం అనువుగా ఉండేలా క్రీడా మైదానాన్ని తీర్చిదిద్దాలన్నారు. ఏ మాత్రం జాప్యం చేయకుండా పనులు వేగంగా చేయాలన్నారు. టెండర్ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలన్నారు. గ్రౌండ్ చుట్టూ గ్రీనరీ ఉట్టిపడే విధంగా తయారు చేయాలని ఆమె అధికారులకు సూచించారు. ఆటలు ఆడుకోవడానికి లైటింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కార్పొరేషన్ పాలక వర్గం పదవి కాలం ముగియక ముందే పనులు పూర్తి చేయించాలని ఆదేశించారు.

### చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించాలి..

చెరువుల్లో గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించాలని ఎమ్మెల్యే చెప్పారు. మంత్రాల చెరువు, చందన చెరువు, పెద్ద చెరువుల పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. చెరువుల చుట్టూ గ్రిల్స్ ఏర్పాటు చేయాలన్నారు. తాత్సారం చేయకుండా పనులు చేయాలని చెప్పారు. శ్మశాన వాటికల్లో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలన్నారు. పనులు ఆలస్యం కావడానికి కారణాలు ఏమిటని అధికారులను అడిగారు. సాకులు చెప్పకుండా పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. అనంతరం దివ్యాంగులకు ట్రై సైకిల్స్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఆశ వర్కర్ల సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేశ్ రెడ్డి, సునీతా బాల్ రాజ్, రమేశ్, శ్రీనూనాయక్, యెల్చ సుదర్శన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## 2 గంటల ముందే ఎయిర్‌పోర్ట్‌కు రండి



సిటీబ్యూరో, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : సంక్రాంతి పండుగ దృష్ట్యా ప్రయాణికుల రద్దీ పెరుగుతుండడంతో ఇబ్బందులు తలెత్తకుండా రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ శుక్రవారం ట్రావెల్ అడ్వైజరీ విడుదల చేసింది. విమాన సేవలు వినియోగించుకునే డొమస్టిక్ ప్రయాణికులు 2 గంటల ముందుగానే విమానాశ్రయానికి చేరుకోవాలని సూచించారు. విదేశీ ప్రయాణికులు 3 గంటల ముందే చేరుకోవాలని కోరారు. డిజీ యాత్ర సేవలు ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. ఇబ్బందులు లేని ప్రయాణం కోసం తమ సిబ్బందికి ప్రయాణికులు సహకరించాలని కోరారు.

# మళ్లీ హైడ్రా కూల్చివేతలు

**మణికొండ, జనవరి 10:** నిబంధనలను అతిక్రమించి నిర్మిస్తున్న నాలుగు విల్లాలను హైడ్రా, టౌన్‌ప్లానింగ్ అధికారులు సంయుక్తంగా శుక్రవారం పోలీసు బందోబస్తుతో నేలమట్టం చేశారు. నెక్నాంపూర్ పెద్ద చెరువు ఎగువ ప్రాంతంలో గత కొన్నాళ్లుగా నిర్మాణాలు చేపడుతున్న లేక్ వ్యూ వెంచర్‌లో నాలుగు విల్లాలను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలతో కూల్చివేశారు. చెరువు బఫర్‌జోన్ల పరిధిలో నిర్మితమవుతున్న ఈ విల్లాలకు అనేకసార్లు మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖల అధికారులు నోటీసులు జారీచేసినా.. మొండిగా నిర్మాణాలు చేపడుతుండటంతో స్థానిక ప్రజలు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్ నెక్నాంపూర్‌లో పర్యటించిన మరుసటిరోజే కూల్చివేతలను చేపట్టారు. గతంలోనూ రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు లే వ్యూ లే అవుట్‌లో వెలసిన అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేసిన విషయం తెలిసిందే. అయినా సదరు నిర్మాణదారుల్లో ఎలాంటి మార్పులు లేకపోవడంపై అధికారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అధికారుల పర్యటన తర్వాత సదరు బిల్డర్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

## మణికొండలో నాలుగు విల్లాల నేలమట్టం

**అనుమతులిచ్చి.. ఆపై తిరస్కరించి**

నెక్నాంపూర్ గ్రామ పెద్ద చెరువు ఎగువ ప్రాంతంలోని కొనసాగుతున్న లేక్ వ్యూ వెంచర్‌లో నిర్మితమవుతున్న విల్లాలకు గతంలో మణికొండ మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అనుమతులిచ్చినట్లు తెలిసింది. అయితే ఆ నాలుగు విల్లాలు బఫర్‌జోన్ పరిధిలోకి వస్తాయంటూ స్థానిక గండిపేట రెవెన్యూ అధికారులు సూచించడంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఇచ్చిన అనుమతులను గుట్టుచప్పుడు కాకుండా రీవోక్ చేసినట్లు సమాచారం. మున్సిపల్ అధికారులు అనుమతులివ్వడంతోనే తాము విల్లాలు నిర్మించామని ఇప్పుడు..హైడ్రా అధికారులు వచ్చి ఎలాంటి నోటీసులు లేకుండానే కూల్చివేశారంటూ నిర్మాణదారులు ఆరోపిస్తున్నారు. కోట్లాది రూపాయలను వెచ్చించి నిర్మించుకున్న తమ ఇండ్లను అర్ధాంతరంగా కూల్చివేసిన హైడ్రా అధికారులపై న్యాయస్థానానికి వెళ్తామని బాధితులు అంటున్నారు.

